క్లుప్తంగా

నేటి నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

కలికిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు మూడు రోజుల పాటు వివిధ రకాల పాలనా సంబంధ అంశాలపై శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఈఓపీఆర్డీ పరుశురాం తెలిపారు. సోమవారం నుంచి 14వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మహల్‌లో ఉరుసు

కలికిరి : మండలంలోని మహల్‌లో సోమవారం సాయంత్రం హజరత్ సయ్యద్ షా మహమూద్ బాషా ఖురాని ఖాదరి సహమీరి సాహెబ్ ఉరుసు ఉత్సవం జరుగుతుందని ఆస్థాన పీఠాధిపతి వర్గ సభ్యులు డాక్టర్ మొహమ్మద్ రియా బాషా ఖురాని సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఖురాన్ గ్రంథ పారాయణం, భక్తి గీతాలాపన, రాత్రి గురువు సమాధిపై చాదర్ సమర్పించి ప్రార్థనలు, ధార్మిక ఉపన్యాసాలు జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మత గురువులు, భక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు.

మల్లయ్య కొండకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మల్లయ్యకొండకు చేరుకుంటుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుపుతామన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాజేయడానికే సవరణలు



ఎస్.ఎ.కరీముల్లా

మదనపల్లె సిటీ : మైనార్టీలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాజేయడానికే కేంద్రం 40 సవరణలు చేస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టిందని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.ఎ.కరీముల్లా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇండియా కూటమిలోని ప్రతిపక్షాలతో పాటు రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం హర్షించదగ్గ విషయమన్నారు. మైనార్టీలకు ఏం కష్టమొచ్చినా, ఏం నష్టం జరిగినా అండగా ఉంటామని ఎన్నికల ముందు అధికార టీడీపీ, జనసేవ పార్టీలు ప్రగల్భాలు పలికాయని ఆరోపించారు. పార్లమెంటులో ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడితే టీడీపీ ,జనసేన పార్టీలు సమర్థిస్తూ మద్దతు పలకడం శోచనీయమన్నారు.

స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రెడ్డెప్ప



మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన ఎస్.రెడ్డెప్ప నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎస్.పి.శేషగిరిరావు ఆయనకు నియామకపత్రం అందజేశారు. పుంగనూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రెడ్డెప్ప ఏపీపీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎంపిక కావడంపై పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కలికిరి సీఐగా రెడ్డిశేఖర్‌రెడ్డి



కలికిరి : కలికిరి స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా రెడ్డిశేఖర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చిన సీఐ ఆర్.మోహన్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ అన్నమయ్య జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తిరుమల క్రైం సీఐగా ఉన్న రెడ్డిశేఖర్ రెడ్డిని నియమించడంతో ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, నేరాల అదుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కురబలకోట తహసీల్దారుగా తపస్విని



తహసీల్దారుకు సిబ్బంది శుభాకాంక్షలు

కురబలకోట ; కురబలకోట తహసీల్దారుగా తపస్విని ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నిమ్మనపల్లె డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న ఈమెను ఇక్కడికి ఇన్‌చార్జి తహసీల్దారుగా బదిలీ చేశారు. పూర్తి బాధ్యతలు అప్పగించారు. వివిధ రెవెన్యూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

జనావాసం.. మురుగుతో సావాసం

- మురికినీటి కాసారంగా మారిన కోమటివానిచెరువు
- దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు



చెరువులో నిండిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ నడిబొడ్డున ఉన్న కోమటివానిచెరువు మురికినీటి కాసారంగా మారింది. దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చెరువులో చెత్తాచెదారంతో పాటు పలు ఆస్పత్రుల వ్యర్థాలు, జంతు కబేళాలు, కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. చెరువు నిండా ప్లాస్టిక్ పేపర్లు నిండిపోయాయి. ఈ చెరువులోకి ఎగువ కురవంకతో పాటు ప్రశాంత్‌నగర్, ఇందిరానగర్ డ్రైనేజీ కాలువ నీరు చేరుతుంది. నిత్యం ప్రజలు కోమటివానిచెరువు మీదుగా గొల్లపల్లి, ఎస్‌బీఐ కాలనీ, నీరుగట్టువారిపల్లె ప్రాంతాలకు వెళతారు. ఈ దారిలో పోవాలంటే భయంగా ఉంది. గతంలో చెరువు చివరన చెరువులోని నీరు తూముల ద్వారా బయటకు పంపేవారు. ప్లాస్టిక్ నిండిపోవడంతో చెరువులోని నీరు బయటకు పోవడం లేదు. దీంతో మరింత దుర్వాసన వెదజల్లుతోంది.

బోట్ క్లబ్ ఏర్పాటు కలేనా.!

కోమటివానిచెరువులో బోట్ క్లబ్ ఏర్పాటు చేస్తామని అప్పటి మున్సిపల్ పాలకులు హామీ ఇచ్చారు. బోట్‌తో పాటు కోమటివానిచెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. తర్వాత దీన్ని గురించి మరిపోయారు.

కోమటివానిచెరువులో ఆక్రమణలు

పట్టణ నడిబొడ్డున ఉన్న కోమటివానిచెరువు ఆక్రమణలకు గురవుతోంది. దీంతో చెరువు కుంచించుకుపోతోంది. గతంలో చెరువు చాలా పెద్దగా ఉండేది. ప్రస్తుతం కబ్జాదారులు చెరువులో పెద్ద భవనాలు నిర్మించారు. దీంతో భారీ వర్షాలు కురిస్తే చెరువు కట్టపై నుంచి వర్షపునీరు పొంగి పొర్లి ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల వరకు ప్రవహిస్తుంది. చెరువు ఆక్రమణలు తొలగించి చెరువులో మంచినీటిని నిల్వ చేస్తే పట్టణంలో నీటి సమస్య తీర్చే అవకాశాలు ఉన్నాయి.

చెరువును ప్రక్షాళన చేయాలి



కోమటివానిచెరువు ప్రక్షాళన చేయాలి. వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ చెరువును శుభ్రపరిచి అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలి. చెరువును సుందరీకరణ చేయాలి.

– తిరుపతిరావు, టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



విరాళాన్ని ఆలయ ఈఓ మంజులకు అందజేస్తున్న దాత డాక్టర్ మానేరి వెంకటరమణ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయ పునర్ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. బి.కొత్తకోట మండలం బడికాయపల్లెకు చెందిన డాక్టర్ మానేరి వెంకటరమణ రూ.50,116, బెంగళూరుకు చెందిన వెంకటకిరణ్ కుమార్ రూ.25,116లు ఆలయ ఈఓ మంజులకు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం ఇండియన్ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

రెడ్డెమ్మ కొండలో భక్తుల రద్దీ

మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతోపాటు ముస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం విశేషం.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 35 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 104 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్య, డాక్టర్ సృజన, డాక్టర్ పూజిత, డాక్టర్ ప్రీతి, డాక్టర్ సమీమ్, వలంటీర్లు శ్రీనివాసులురెడ్డి, రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



వైద్య శిబిరంలో సూచనలు ఇస్తున్న డాక్టర్ అనుపమ

తంబళ్లపల్లె : మండల కేంద్రంలో ముగ్గురు బాలికలకు డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'తంబళ్లపల్లెలో డెంగీ పంజా' అనే వార్త ప్రచురితమైంది. దీనిపై పంచాయతీరాజ్, వైద్యాధికారులు స్పందించారు. మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. మురికినీటి కాలువలు శుభ్రం చేశారు. మురికినీటి కుంటల్లో బ్లీచింగ్, అబైట్ మందులు చల్లారు. దోమల నివారణకు రాత్రి పూట ఫాగింగ్ చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలను సమావేశపరిచి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైడే పాటించాలని, రాత్రివేళ అందరూ దోమతెరలు వాడాలని, జ్వరం బారిన పడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

80 మంది ఉచిత ఆపరేషన్లకు ఎంపిక



ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 80 మందిని ఉచిత కంటిఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో మదనపల్లెకు చెందిన డాక్టర్ అగర్వాల్స్ దృష్టి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటిలో శుక్లాలు, కేటరాక్ట్ ఉన్న వారిని 80 మందిని గుర్తించి ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, వైద్యులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలను విజయవంతం చేయాలి



స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణ ప్రజలందరికీ చాలారోజులు గుర్తుండిపోయేలా అంగరంగ వైభవంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న స్వాతంత్య్ర వేడుకల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు సంబంధించి ప్లానింగ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...స్వాతంత్య్ర ఉద్యమంలో చరిత్రాత్మక నేపథ్యం కలిగిన మదనపల్లె గురించి నేటితరానికి తెలపాలనే ఉద్దేశంతో మూడు రోజులపాటు ముందస్తు స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా 12వతేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు జెడ్పీ హైస్కూల్‌లో పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంటర్ కళాశాలలకు చెందిన సుమారు 6వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలతో పాటు జాతీయ జెండాను ప్రదర్శిస్తామన్నారు. 13వతేదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు మిషన్ కాంపౌండ్‌లో 8,9,10 తరగతులకు చెందిన హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ మిషన్ కాంపౌండ్‌లో ఉదయం 11 నుంచి అర్ధరాత్రి 12.33 నిమిషాల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా పద్మశ్రీ డాక్టర్ శోభారాజు గాత్ర కచేరి, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.కొండయ్యనాయుడు, కమిషనర్ కె.ప్రమీల, డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ఎన్.సేతు, రఘునాథరెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఓంప్రకాష్, పోతబోలు రెడ్డెప్ప, పీటీఎం శివప్రసాద్, పోర్డ్ లలితమ్మ, నాదెళ్ల విద్యాసాగర్, శివ, ఎస్.ఏ.మస్తాన్, సురేంద్ర, ఎంతఊట ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

130 మందికి కంటి పరీక్షలు



పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 130 మందికి కంటి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వైద్యుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరిశంకర్ తెలిపారు. 130 మందికి కంటి పరీక్షలుచేసి 50 మందికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 30 మందిని ఉచిత కంటి అద్దాలకు, 48 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నందిని, చాందిని, ట్రస్ట్ ఏఓ కృష్ణ గల్లా పాల్గొన్నారు.

మునిగోపాలకృష్ణకు జాతీయ పురస్కారం

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజన్లకు చేసిన సేవలను గుర్తిస్తూ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణకు అభిలాష హెల్పింగ్‌మైండ్స్ సంస్థ జాతీయ స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందజేసింది. హైదరాబాదులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీహరి అవార్డును అందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన్ను మదనపల్లె సీనియర్ సిటిజెన్స్ నాయకులు తిరుపతిరావు, శ్రీనివాసులు, వై.ఎస్.మునిరత్నం, కరుణాకర్, కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.



అవార్డు అందుకున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ

అమూల్ డెయిరీ ద్వారానే పాలను సేకరించాలి

మదనపల్లె : అమూల్ డెయిరీ విషయంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పాలసేకరణ కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరికృష్ణ, ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సభ (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకుడు పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లెలో ఏఐకేఎంఎస్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో అమూల్ డెయిరీ ద్వారా చేస్తున్న పాలసేకరణ నిలిపివేస్తున్నట్లు సంస్థ సిబ్బంది రైతులకు తెలిపారన్నారు. దీనిపై తీవ్రమైన ఆందోళనలకు గురైన రైతాంగం రాయలసీమ జిల్లాల్లో తీవ్రమైన ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రభుత్వ ఒత్తిడితోనే అమూల్ సంస్థ పాలసేకరణ నిలిపివేసేందుకు నిర్ణయించుకుందని, హెరిటేజ్, ఇతర ప్రైవేట్ డెయిరీలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అనుమానిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని అమూల్ పాలసేకరణ కొనసాగేలా చూడాలన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ నివేదిత



మాట్లాడుతున్న లయన్స్ వైస్ డిస్ట్రిక్ వైస్ గవర్నర్ అశ్వర్థనారాయణ

మదనపల్లె సిటీ : మదనపల్లె లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ నివేదిత ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక గొల్లపల్లి వద్ద జరిగిన ఓ ఫంక్షన్ హాలులో లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సమావేశం జరిగింది. లయన్స్ డిస్ట్రిక్ వైస్ గవర్నర్ అశ్వర్థనారాయణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా పలు సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ఏడీసీఎస్ గంగారపు గౌతమ్, అరుణ్‌కుమార్, జోన్ చైర్మన్లు మనోజ్‌కుమార్‌రెడ్డి, భాస్కరాచారి, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మిగులు భూములివ్వాలి

పీలేరురూరల్ : దళిత, గిరిజన, బీసీ, మైనారిటీలలో భూమిలేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం మిగులు భూములు ఇవ్వాలని మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నారాయణ, జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకటరమణ కోరారు. ఆదివారం స్థానిక ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో మాలమహానాడు ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా దళితవాడలకు శ్మశాన వాటికలు లేవని, అనువైన స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం మాలమహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షునిగా చీకటిపల్లె మల్లికార్జున, నియోజకవర్గ డివిజన్ కార్యదర్శిగా పల్లం నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు చీకటిపల్లె రామాంజులు, గుండ్లూరు జయరామచంద్రయ్య, మద్దెల రమేష్, వెంకటేష్, బద్దె భానుప్రకాష్, రెడ్డెమ్మ, మోహన్‌బాబు, బండి పార్వతి, శారద తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మాజీ సైనికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో జరిగిన మాజీ సైనికుల సంఘం సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సైనికులకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరించి, పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రతి మాజీ సైనికుడికి 2 కుంటల స్థలం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలోని బీకే.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.8/1లో మాజీ సైనికులకు కేటాయించిన 2సీ పట్టాల్లో జరిగిన భూ ఆక్రమణపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. పట్టణంలోని ఓ కూడలిని జై జవాన్ కూడలిగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు కల్నల్ బాషా, యూసుఫ్, నాగరాజ, ప్రతాప్‌రెడ్డి, సులేమాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్గులు ఆవిష్కరణ



విగ్గులను పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల కోసం దాతలు ఇచ్చిన కేశాలతో తయారు చేసిన విగ్గులను ఆదివారం డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు ఆవిష్కరించారు. స్థానిక హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. హెల్పింగ్ మైండ్స్ చేపట్టిన కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఇప్పటి వరకు 56 మంది దాతలు ముందుకు వచ్చి కేశాలు దానం చేశారన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్, సభ్యులు పురుషోత్తం, కిరణ్, అజిత్, షేక్‌షా, అఫీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్‌ఐలకు ఘన సన్మానం



సీఐ, ఎస్‌ఐలను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పీలేరు రూరల్ : పీలేరు నుంచి బదిలీపై వెళ్తున్న సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు నరసింహుడు, రమణలకు ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

మరింత మెరుగైన సేవలు అందించండి

లక్కిరెడ్డిపల్లి : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమని, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటీ సభ్యులు పేద ప్రజలకు సంస్థ ఆధ్వర్యంలో మరింత మెరుగైన సేవలు అందించాలని మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నలందా హైస్కూల్‌లో జరిగిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రి సోదరుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, ముఖ్య అతిథిగా మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారి విలువైన సమయాన్ని వెచ్చించి కరోనా కష్టకాలంలో పేద ప్రజలకు అండగా నిలిచారన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షులు రమణారావు, చైర్మన్ ఏఎస్ బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం అధ్యక్షులుగా డాక్టర్ ఎస్ఎండీ షఫీ నాయక్, ఉపాధ్యక్షులుగా కె.మల్లిరెడ్డి, కార్యదర్శిగా ఎ.రామచంద్ర, కోశాధికారిగా పి.రవిశంకర్, జాయింట్ సెక్రటరీగా వై.గంగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గోవిందు నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు.

కొత్త ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



ఎస్.కే.రహీముల్లా (టు టౌన్ మదనపల్లె)



కృష్ణమూర్తి (టు టౌన్ మదనపల్లె)



మల్లికార్జునరెడ్డి (పీలేరు అర్బన్)



బాలకృష్ణ (పీలేరు అర్బన్)



పి. దిలీప్‌కుమార్ (ముదివేడు)



ఎస్‌ఐ గాయత్రి (ములకలచెరువు)



ఎం.కె. నరసింహుడు (పెద్దతిప్పసముద్రం)

మదనపల్లె : మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో నూతన ఎస్‌ఐలు బాధ్యతలు స్వీకరించారు. కేవీపల్లె నుంచి మదనపల్లెకు బదిలీ అయిన ఎస్.కె.రహీముల్లా, దిశ పోలీస్‌స్టేషన్ రాయచోటి నుంచి బదిలీపై వచ్చిన కృష్ణమూర్తిలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అలాగే తాలూకా పోలీసు స్టేషన్‌లో వన్‌టౌన్ నుంచి బదిలీపై వచ్చిన పి.వి.రమణ బాధ్యతలు స్వీకరించారు.

పీలేరు : పీలేరు అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలుగా పి.మల్లికార్జునరెడ్డి, బాలకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముదివేడు నుంచి మల్లికార్జునరెడ్డి, మదనపల్లె 1 టౌన్ నుంచి బాలకృష్ణ బదిలీపై పీలేరుకు వచ్చారు.

కురబలకోట : కురబలకోట మండలం ముదివేడు ఎస్‌ఐగా పి. దిలీప్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పీలేరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ములకలచెరువు ఎస్‌ఐ బాధ్యతలు

ములకలచెరువు : మండల ఎస్‌ఐగా గాయత్రి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో అన్నమయ్య జిల్లా కేంద్రంలోని దిశ స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పెద్దతిప్పసముద్రం : మండల నూతన ఎస్‌ఐగా ఎం.కె. నరసింహుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పీలేరు ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.